

అనంత కలెక్టరేట్ ముట్టడి

పాలికేక ఢిల్లీకి

వినిపించాలి

● ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి ● నినదించిన అనంత జనవాహిని ● జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'అనంత ప్రజల పొలికేక ఢిల్లీకి వినిపించాలి. ఆర్డీటీకి విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ)ను రెన్యువల్ చేయాలి' అని ఆర్డీటీ లబ్ధిదారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో పొలికేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు సాగిన భారీ ర్యాలీతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ వద్ద ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిలపక్ష కమిటీ నాయకులు డాక్టర్ అక్కులప్ప, బీసీఆర్ దాస్, సాకేహరి, యల్లన్న, ఉమామహేశ్వరి మాట్లాడారు. ఆరు దశాబ్దాల ఆర్డీటీ ప్రయాణంలో అనంతపురం ఉమ్మడి జిల్లాకు ఎంతో మంచి జరిగిందన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేలా కుంటలు, చెక్‌డ్యాంలు ఆర్డీటీవారు నిర్మించారన్నారు. ఉపాధి మార్గాలు చూపి, ఉచిత విద్య, వైద్యం అందించిందని కొనియాడారు. ఇలా పేద కుటుంబాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీకి ఆర్థిక వనరులు స్తంభింప చేయడం దారుణమని మండిపడ్డారు. ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. ప్రతి గ్రామం, వీధి నుంచి వేలాదిగా ప్రజలు (మిగతా 6లో....)

ఇష్టమొచ్చినట్లు

మాట్లాడితే ఊరుకోం

జగన్ రెడ్డి, పేర్ని నాని, రోజాపై చిలకం మండిపాటు



ధర్మవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మాజీ సీఎం జగన్‌రెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, రోజాను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. జనసేన పార్టీ స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి సైకో బ్యాచ్‌తో అసభ్య పదజాలంతో తిట్టిస్తున్నారన్నారు. దీనిని సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి రోజాకు లేదన్నారు. ప్రజలు ఛీకొట్టినా పేర్ని నానికి బుద్ధి రాలేదన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని సూచించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు

● కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పుట్టపర్తి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్‌కు సూచించారు. నాలుగో రాష్ట్ర స్థాయి జిల్లా కలెక్టర్ల సదస్సు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో సోమవా రం నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. తొలిరోజు జిల్లాలో ప్రగతి, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించి భవిష్యత్ దిశానిర్దేశం చేశారు. ఎనిమిది విభాగాల్లో వివిధ ప్రభుత్వ శాఖలపై సమీక్షతోపాటు జీఎస్డీపీ సంక్షేమం, పీ-4, సూపర్ సిక్స్ అమలు వంటి అంశాలపై సమీక్షించారు. లాజిస్టిక్ ఇన్‌ఫ్రా, స్వచ్ఛాంధ్ర, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరోడ్లు, వ్యవసాయ అనుబంధరంగాలు, సర్క్యులర్ ఎకానమీతోపాటు పలు రంగాలపై చర్చ చేపట్టారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామికీకరణ, సేవల రంగాలతోపాటు జీఎస్డీపీ పెంపునకు ఆయా జిల్లాల్లో అభివృద్ధి సాధించాల్సిన అంశాలపై సీఎం సమీక్షించారు.

జిల్లాల వారిగా గ్రేడ్లు

రాష్ట్రంలో 26 జిల్లాలకు 2025-26 ప్రతిపాదిత జీఎస్డీపీలో జిల్లా వారీగా వ్యవసాయం అనుబంధ, పరిశ్రమలు, సేవల్లో పలు రంగాల్లో లక్ష్యం గ్రోత్ రేట్, మార్కులు, గ్రేడ్లు ఇచ్చారు. జిల్లాకు రూ. 70079 కోట్ల లక్ష్యంకాగా గ్రోత్‌రేట్ 17.83శాతంతో తొలిదశలో రూ. 12248 కోట్లు అధిగమించింది. స్వచ్ఛాంధ్రలో 28 అంశాల్లో జిల్లాకు 20వ స్థానం, 61 మార్కులతో గ్రేడ్ బీ దక్కింది. టాప్ పది మండలాల్లో జిల్లాలో కదిరి 81 మార్కులతో ఏ గ్రేడ్ దక్కించుకుంది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో లక్ష్యం అధిగమించడంతో జిల్లాకు 15 స్థానం, 29 మార్కులతో సీ గ్రేడ్ దక్కింది. జిల్లాకు 2025-26కు జీవీఏలో లక్ష్యం రూ. 25209 కోట్లు కాగా గ్రోత్ రేట్ 17.86 శాతంతో తొలిదశలో రూ. 3308 కోట్ల సాధించారు. 2024-25లో మాంసం, పాల ఉత్పత్తిలో జిల్లా తొమ్మిదో స్థానంలో నిలిచింది. పరిశ్రమల విభాగంలో జిల్లాకు 19వ స్థానం లభించగా 60మార్కులతో బీ గ్రేడ్ దక్కింది. పరిశ్రమలు, ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ, ఐటీ ఎలక్ట్రానిక్ ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం ఇతర పెట్టుబడులు, భూముల లభ్యతతో పారిశ్రామి కారిడార్లు ఏర్పాటుకు జిల్లాలో 49.5 శాతం అవకాశం ఉంది. రక్షణ (డిఫెన్స్)లేపాక్షి, మడకశిర ఏరోస్పేస్ ఎలాక్ట్రానిక్స్ క్లస్టర్లు, కేటాయించారు. ఇక సేవల విభాగంలో 12 సేవ రంగాల్లో జిల్లా 25వ స్థానంలో నిలవగా 68మార్కులతో బీ గ్రేడ్ దక్కింది. జిల్లా సమగ్ర అభివృద్ధికి సుకోవాల్సిన చర్యలపై సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రజెంటేషన్ చేయనున్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో సూర్య నారాయణ రెడ్డి

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చి ప్రజలిచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఇన్‌చార్జ్ డీఆర్వో సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎ‌స్)లో 232 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ డీఆర్వో మాట్లాడుతూ అధికారులు సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. భూ సమస్యలు, రేషన్‌కార్డులు, ఇంటిపట్టాల మంజూరు, నూతన పింఛన్ల మంజూరు, తదితర సమస్యలపై అధికంగా అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డీపీఓ సమత, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీసీఓ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల బాధలు..!



నల్లమాడ బస్టాండు సమీపంలోని బీసీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు

నల్లమాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చకచకా రోడ్ల పనులు పూర్తి చేస్తే నెలలు గడుస్తున్నా.. బిల్లులు అందలేదు. అప్పులు చేసి.. పనులు చేసిన కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. అప్పులకు వడ్డీలు చెల్లించలేక దిక్కులు చూస్తున్నారు. గతేడాది కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. పెద్దఎత్తున సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయి. మొదట్లో చేసిన పనులకు వెంటవెంటనే బిల్లులు పడ్డాయి. దీంతో కూటమి నేతలు పనులు దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. కొందరైతే కమీషన్లు ఇచ్చుకుని మరీ.. పనులు చేసినట్లు తెలుస్తోంది. బిల్లులు వెంటనే వస్తాయన్న ఆశతో దగ్గర డబ్బు లేకున్నా.. అప్పులు చేసి.. పనులు పూర్తి చేశారు. బిల్లులు మాత్రం నేటికీ అందలేదు. 9 నెలలు గడుస్తున్నా.. రూపాయి కూడా రాలేదు. ఎప్పుడొస్తాయోనని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

రూ.3 కోట్ల పనులు


గతేడాది ఉపాధి హామీ పథకం కింద మండలానికి రూ.3 కోట్ల విలువైన సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయి. నల్లమాడ, దొన్నికోట, పులగంపల్లి పంచాయతీల్లో పనులు చేశారు. మొదట్లో కొన్ని వారాల పాటు వెంటవెంటనే బిల్లులు పడ్డాయి. దీంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు ఇతరులకు కమీషన్లు ఇచ్చి సిమెంటు రోడ్ల పనులు దక్కించుకున్నారు. అధికారులు వేగవంతంగా పనులు చేయాలని చెప్పడంతో అప్పులు చేసి పూర్తి చేశారు. 9 నెలలైనా బిల్లులు మాత్రం అందలేదు. రూ.3 కోట్ల మేర పనులు చేస్తే, అందులో రూ.30 లక్షలు మాత్రమే బిల్లులు అయ్యాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. టీడీపీ హయాంలో కొంతమంది కాంట్రాక్టర్లు పెద్దఎత్తున సీసీ రోడ్లు తదితర పనులు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటికి బిల్లులు చెల్లించకుండా ఆపేసింది. ఐదేళ్లూ బిల్లులు ఇవ్వలేదు. దీంతో చాలామంది కాంట్రాక్టర్లు అప్పులపాలయ్యారు. గతేడాది అధికారం చేపట్టిన కూటమి.. పాత బిల్లులు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో కాంట్రాక్టర్లు ఆశలు పెంచుకున్నారు. పాతవి చెల్లించకపోగా.. కొత్తగా పల్లె పండుగలో భాగంగా చేసిన పనులకు కూడా ఇంతవరకు బిల్లులు రాలేదు. దీంతో కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నెలలు గడుస్తున్నా...



కొండ్రవారిపల్లిలో రూ.9లక్షలతో సిమెంటురోడ్లు వేశా. ప్రతి గురువారం స్లాట్ ఇస్తే శుక్ర, శనివారాల్లో బిల్లులు వస్తాయన్న ఉద్దేశంతో అప్పులు చేసి మరీ.. పనులు చేశా. వారం కాదు కదా.. 9 నెలలు గడుస్తున్నా బిల్లులు అందలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలి. **-గంగులప్ప, కొండ్రవారిపల్లి**

పనులు చేసినా.. బిల్లులు రాలేదు



పెమనకుంటపల్లి, కొండ్రవారిపల్లిలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు పనులు చేశా. 9నెలలు గడుస్తున్నా రూపాయి కూడా బిల్లు అందలేదు. ఇప్పుడు బిల్లులు వచ్చినా, వడ్డీలకే సరిపోతాయి. రూపాయి కూడా మిగిలే పరిస్థితి లేదు. టీడీపీ హయాంలో కూడా పనులు చేసి బిల్లులు రాక వడ్డీలు కడుతున్నాం. కూటమి పాలనలోనూ అప్పుల భారం తప్పలేదు.

- పుట్ల రవీంద్ర, పెమనకుంటపల్లి

నివేదికలు పంపాం..

సీసీ రోడ్డు పనులను పరిశీలించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే కాంట్రాక్టర్లకు జమవుతాయి.

-సాయి, పీఆర్ జేఈ, నల్లమాడ

దొడగట్టకు అధికారుల పరుగులు

● దళితవాడలో వైద్యశిబిరం
● మురుగు కాలువలు శుభ్రం చేయించిన పంచాయతీ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విషజ్వరాల గురించి ఆరాతీస్తున్న డీఎంహెచ్‌ఓ

రొద్దం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడగట్ట పంచాయతీలో విషజ్వరాలు ప్రబలడంపై 'జ్వరగట్ట' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' సోమవారం ప్రచురించిన కథనంతో అధికారులు మేల్కొన్నారు. వైద్య ఆరోగ్య, పంచాయతీ అధికారులు గ్రామానికి పరుగులు పెట్టారు. 50 మంది విషజ్వరాలతో మంచానపడినా నిర్లక్ష్యం వహించారంటూ పెద్దమంతూరు వైద్యాధికారి రమ్యపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఫైరోజ్‌బేగం మండిపడ్డారు. దళితవాడలో అపరిశుభ్రంగా ఉండి విషజ్వరాలు సోకేంతవరకు ఏం చేస్తున్నారని నిలదీశారు. వైద్యశిబిరం ఏర్పాటుచేసి రోగులకు వైద్యం అందించారు. ప్రతి ఇంటికీ తిరిగి రోగులకు సూచనలు, సలహాలు అందించారు. డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాగింగ్ చేయించారు. డ్రైనేజీ కాలువలో పగిలిపోయిన తాగునీటి పైపులైన్ మరమ్మతులను ఈఓఆర్డీ గోవిందప్ప చేపట్టారు. సమస్యపై వైద్యాధికారులను కాలనీవాసులు నిలదీశారు. కలుషిత నీటి కారణంగానే విషజ్వరాలు సోకాయని డీఎంహెచ్‌ఓ వారికి తెలిపారు. కానీ నీటి నమూనాలను పరీక్షించామని, కలుషిత నీటివల్ల జ్వరాలు సోకలేదని ఈఓఆర్డీ గోవిందప్ప చెప్పుకొచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, ఎంఎల్‌హెచ్‌పీ ఫిర్దోస్, ఎంపీడీఓ రాంకుమార్, సీహెచ్‌ఓ వన్నప్ప, ఏఎన్‌ఎం శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

అయినా.. తప్పిదాలా..?

● డీఎస్సీ తుది జాబితాలో అనర్హుడి పేరు
● కమిషనర్, ఆర్జేడీ ఆగ్రహం
● అధిక మార్కులు వచ్చినా... జాబితాలో అడుగున పేరు
● తల పట్టుకుంటున్న డీఈఓ
● బాధ్యులను గుర్తించే పనిలో నిమగ్నం



కాల్‌లెటర్ వచ్చినా తుది జాబితాలో పేరు లేదని డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ప్రక్రియను రాష్ట్ర అధికారులే పర్యవేక్షించారు. అక్రమాలకు తావు లేకుండా జాబితాలను సైతం అక్కడి నుంచే పంపారు. జిల్లాలో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అయినా.. తప్పిదాలు దొర్లాయి. ఫైనల్ జాబితాను సైతం జిల్లాకు మాన్యువల్‌గా పంపారు. మరోసారి రోస్టర్, కేటగిరీల వారీగా పరిశీలన చేసి, అనంతరం కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి, జిల్లా కమిటీతో ఆమోదం వేయించుకోవాలని ఆదేశాలిచ్చారు. అయినా డీఎస్సీ ఫైనల్ జాబితాలో అనర్హుడికి పోస్టు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది.

వైద్యుడు సర్టిఫికెట్ ఇచ్చినా..

బుద్ధిమాంద్యం (ఎంఐ) కోటా ప్రత్యేకంగా ఉంటుంది. అభ్యర్థి తీసుకుంటున్న చికిత్సలు, వ్యవహారశైలిని బట్టి ఈ కోటాకు ఎంపిక చేస్తారు. కురుబ శ్రీనివాసులు అనే అభ్యర్థి డీఎస్సీ రాశారు. ఆయనకు ఎంఐ కింద అర్హత (మిగతా 7లో...)

బాధితులకు సత్వర న్యాయం: ఎస్పీ



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను పరిశీలించి, బాధితులకు సత్వరం న్యాయం చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ 60 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఆర్థిక మో సాలు, సైబర్‌నేరాలు వంటివాటిపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పొలికేక ఢిల్లీకి వినిపించాలి

(5వ పేజీ తరువాయి)

స్వచ్ఛందంగా తరలివచ్చినా ప్రభుత్వాలకు కనువిప్పు కలగకపోతే భవిష్యత్ ఉండదని హెచ్చరించారు. పొలికేక కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం అందించారు. పొలికేకకు మద్దతుగా బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప ఆధ్వర్యంలో న్యాయవాదుల జేఏసీ తరలివచ్చి సంఘీభావాన్ని తెలిపింది. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రామాంజనేయులు, అంజి, కుళ్లాయప్ప, సూరి, దొడ్డప్ప, బానాసీ శీన, రామకృష్ణ, హరిగోపాల్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.





బారికేడ్లను తోసుకుని వస్తున్న జనం, కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన జనసందోహం

ఇబ్బంది పడాల్సిందే..



మా ఊర్లో తాగడానికి నీళ్లలేవు. దీంతో చెర్లోపల్లికి వెళ్లి తెచ్చుకుంటున్నాం. మా ఊర్లోనే ఫిల్టర్ ట్యాంక్ కట్టిస్తామని ఆర్డీటీ చెప్పింది. ప్రస్తుత ఇబ్బందులతో డబ్బులు లేక ఫిల్టర్ ట్యాంక్ కట్టడంలేదు. స్కూల్ కట్టించినా ఓపెన్ చేయడంలేదు. ఆర్డీటీలేకుంటే ఇబ్బందులు పడాల్సిందే.

-మాలేపల్లి మహిళలు, కుందుర్పి మండలం

ఇల్లు కట్టించారు



మాకు సొంత ఇల్లు కట్టించారు. పొదుపు సంఘంలో రుణాలిచ్చారు. నా కుమారుడు డిగ్రీ, ఇద్దరు కుమార్తెలు ఇంటర్మీడియేట్ చదివారు. వారి విద్యకు ఆర్డీటీనే ఆర్థిక సాయం చేసింది. ఐదో తరగతి వరకు ఆర్డీటీ పాఠశాలలోనే చదివారు. మాలాంటి పేదలకు ఆర్డీటీనే దిక్కు. ప్రభుత్వం కరుణించి ఆర్డీటీని కాపాడాలి.

-రామలక్ష్మి, కొడపగానిపల్లి, కొత్తచెరువు మండలం

రుణాలు ఇచ్చారు



పదిమంది మహిళలను ఒక పొదుపు సంఘంగా ఏర్పాటు చేసి రుణాలిచ్చారు. దాని ద్వారా గేదెలు, గొర్రెలు పెంచుకుని డబ్బులు సంపాదించేవాళ్లం. చేన్లలో కుంటలు తవ్వించి, చెక్ డ్యాంలు కట్టారు. గవర్నమెంట్ రూమ్‌ల కంటే మంచి ఇళ్లను ఆర్డీటీ కట్టించింది. ఇప్పుడేమి పనులు చేయడంలేదు.

-పెద్దక్క, లక్షుంపల్లి, పెద్దవడగూరు మండలం

ఐదుగురిని చదివించింది



నాకు ఐదుగురు పిల్లలుంటే వారందరినీ ఆర్డీటీనే చదివించింది. అన్నం కూడా ఆర్డీటీ స్కూల్లోనే పెట్టేవారు. ఒక ఎకరా భూమి లేని మాలాంటి పేదలకు చదువులు, ఆస్పత్రులు, కూలి పనులు అన్ని ఆర్డీటీనే చూసుకుంది. ఇప్పుడు మూసివేస్తే ముందు తరాలు ఏమికావాలి.

-లక్ష్మక్క, మాలేపల్లి, కుందుర్పి మండలం

15 మందికి ఉద్యోగాలు



నా కొడుకును ఆర్డీటీనే ఇంజినీరింగ్ చదివించింది. కుమార్తెను బీఫార్మసీ చదివిస్తోంది. ఆర్డీటీ చదివించిన 15మంది పిల్లోల్లు మా ఊర్లో ఉద్యోగాలు సాధించారు. ఒక పిల్లోడు డాక్టర్ అయినాడు. పొదుపు సంఘంలో రుణాలు ఇచ్చినారు. పాడి ద్వారా ఉపాధి పొందడానికి గేదెలు ఇచ్చారు. ఆర్డీటీ లేకుంటే మేములేము.

-అక్కమ్మ, బొందలవాడ, నార్పల మండలం

ఆర్డీటీని దూరం చేస్తున్నారు..



పొదుపు సంఘంలో ఉన్నవారికి రూ.25వేల చొప్పున రుణం ఇచ్చారు. గ్రామ స్వరాజ్యం కింద 79మందికి రూ.20వేల ప్రకారం బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లాగా చేశారు. ఆ డబ్బులు అట్లే ఉంటాయి. వడ్డీ మాత్రమే వాడుకుంటాం. చేన్లో పంటపెట్టుకునేకి రాళ్లు ఏరివేసే పేరుతో డబ్బులు ఇస్తున్నారు. పెట్టుబడికి వినియోగించుకుని పంట వచ్చినప్పుడు కడుతున్నాం. పిల్లోల్లకి బియ్యం, బాళ్లు, గోధుమలు, నూనే, దుస్తులు అన్నీ ఇస్తున్నారు. అలాంటి ఆర్డీటీని మాకు దూరం చేయాలని చూస్తున్నారు.

-పాలవెంకటాపురం మహిళలు, బ్రహ్మసముద్రం మండలం

వానవాన వొద్దప్పా..!

- కొన్ని రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు
- తీవ్రంగా నష్టపోతున్న వేరుశనగ రైతులు
- కట్టె, కాయలు నల్లగా మారుతున్నాయని ఆందోళన

కంబదూరులో తొలగించిన వేరుశనగ కట్టె అంతా నల్లగా మారిన దృశ్యం



కళ్యాణదుర్గం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో అన్నదాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. కోతకోసిన పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నాడు. ఖరీఫ్ ఆరంభానికి ముందే బారుబావుల కింద వేరుశనగ సాగుచేశారు. పంట కాలం పూర్తవడంతో వేరుశనగను తొలగించారు. అయితే వర్షాలు తెరిపిలేకుండా కురుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా వర్షాలు వస్తే పంట తొలగించకపోతే భూమిలోపల ఉన్న కాయలు మొలకలు వస్తాయి. తొలగిస్తే వేరుశనగ కట్టె, కాయలు నల్లగా మారి బూజు పట్టే ప్రమాదం ఉంది. ఎటు చూసినా రైతుకు నష్టమే. దీంతో వానదేవుడా కొన్నాళ్లు వానకు రెస్ట్ ఇవ్వవయ్యా స్వామి అని ఆకాశంలోని మబ్బుల వైపు చూసి వేడుకుంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 1200 ఎకరాలకు పైబడి వేరుశనగ సాగు చేశారు. ఈ సారి వేరుశనగ క్వింటా ధర రూ. ఆరు వేల నుంచి రూ. ఏడువేల దాకా పలుకుతోంది. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉంది. అయితే గత కొన్ని రోజులుగా జడివాన కురుస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ కట్టె, కాయలు పనికిరాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులే..: రాజప్ప, వేరుశనగ రైతు, కంబదూరు



గత కొన్ని రోజులుగా కురిసిన వర్షానికి తొలగించిన వేరుశనగ కట్టెకు తేమశాతం అధికం అవుతోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధిక తేమశాతంతో వేరుశనగ కట్టె అంతా నల్లగా మారిపోయింది. దాంతో పాటు తొలగించిన కట్టెకు మొలకలు వస్తున్నాయి. ఈ తేమశాతం పూర్తిగా పోవాలంటే ఎండ వేడిమి అధికం కావాలి. అప్పటివరకు ఈ కష్టాలు తప్పవు. నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. సుమారు రూ. 1.2 లక్షల దాకా పెట్టుబడి పెట్టా. ఈ అధిక వర్షాలతో నష్టాలు తప్పేలా లేవు.

ఇళ్లలో నీటి ఊట

- ఆందోళనలో బెళుగుప్ప గ్రామస్థులు



గదిలో ఉన్న ఊటనీరు



బెళుగుప్పలో ఊటనీటిని మోటార్లతో బయటకి పంపిస్తున్న దృశ్యం



చేతిపంపు నుంచి ఉబికి వస్తున్న నీరు

బెళుగుప్ప, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో మండల కేంద్రంలో మునుపెన్నడూ చూడనివిధంగా ఊట నీరు ఎక్కువైంది. ప్రతి ఏటా వ్యవసాయ బోరుబావుల్లో నీటి మట్టం తగ్గి పంటల సాగు చేసుకోలేక రైతులు ఇబ్బంది పడేవారు. ఈ ఏడాది మాత్రం భారీ వర్షాలతో ఎక్కడ చూసినా నీరు పుష్కలంగా లభిస్తోంది. బెళుగుప్పలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోనే నీరు ఊరుతోంది. గ్రామానికి అరకిలోమీటర్ దూరంలో ఉన్న మంగోటి చెరువుకు ఈ ఏడాది జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణ జలాలు పుష్కలంగా వదిలారు. అలాగే నాగుల చెరువు భారీ వర్షాలకు నిండిపోయింది. దీంతో గ్రామం లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. చేతిపంపుల నుంచి కూడా భూగర్భజలాలు రేయింబవళ్లు బయటకు వస్తున్నాయి. వ్యాపార సముదాయాలు, ఇంటి సెల్లార్లలో నీరు ఊరుతుండటంతో వాటిని మోటార్ల ద్వారా బయటకి తోడేస్తున్నారు. ఊటనీటితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో, ఏ ఇల్లు కూలుతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ నీరు ఉండటంతో విషపురుగుల సంచారం ఎక్కువైందని, ఇలాంటి పరిస్థితి గ్రామంలో గతంలో ఎన్నడూ చూడలేదని, వేసవి వచ్చేవరకు ఈ ఇబ్బందులు తప్పవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయమేస్తోంది



మా ఇంటి పక్కన పది అడుగుల లోతులో ఊట నీరు నిల్వ ఉంది. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. ఇళ్లలోని నీటిని మోటార్లతో తరలిస్తున్నా, కొద్ది సేపటికే మళ్లీ నీటి ఊటతో నిండిపోతోంది. ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో బతుకుతున్నాం.

-శివశంకర, బెళుగుప్ప గ్రామం



గ్రామ సమీపంలోని నాగులచెరువు

కోలుకునేది ఎలా..?

భారీగా తగ్గిన టమోటా ధర

నెల కిందట 25కిలోల బాక్స్ రూ.800

నేడు రూ.150 నుంచి రూ.200 కూడా కష్టమే

నష్టాల్లో రైతులు



యాడికిలో స్టేకింగ్ పద్ధతిలో సాగుచేసిన టమోటా



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన టమోటా బాక్స్‌లు

యాడికి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు నేలచూపులు చూస్తున్నాయి. నెలకిందటి వరకు మంచి లాభాలు ఇచ్చిన టమోటా ప్రస్తుతం అన్నదాతను ఏడిపిస్తోంది. నెల కిందట 25కిలోల బాక్స్ గరిష్ఠంగా రూ.900 ధర పలికింది. అదే నేడు రూ.150 నుంచి 200 పలికేది కూడా కష్టంగా మారింది. మండలంలో యాడికి, రాయల చెరువు, లక్షుంపల్లి, వెంగన్నపల్లి, చందన, దైవాలమడుగు తదితర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేశారు. పంటలు ప్రస్తుతం కోతదశలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ధరలు పడిపోవడంతో సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడి

ఎకరా పొలంలో టమోటా పంట సాగు చేయడానికి రూ.70వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని తెలిపారు. స్టేకింగ్ పద్ధతిలో టమోటా సాగుకు రూ.1.5లక్షలకు పైగా ఖర్చుచేస్తున్నారు. పెట్టుబడికి తగ్గట్లు పంట దిగుబడి చాలా బాగా వచ్చిందని, ధరలే దారుణంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. 100 బాక్స్‌ల టమోటాలకు 20బాక్స్‌లు సూట్ ఇవ్వాల్సి వస్తోందని, దీంతో కూలీల ఖర్చు, రవాణా ఖర్చులకే పంట దిగుబడి సరిపోతోందని పలువురు రైతులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు పంట దిగుబడిని పొలంలో నుంచి బయటకు తీయలేకపోతున్నామని తెలిపారు. దీంతో తోటల్లోనే టమోటా మాగిపోతున్నాయని తెలిపారు. మండలంలో టమోటా దిగుబడిని రైతులు నంద్యాల జిల్లా ప్యాపిలి, అనంతపురం, గుత్తి, తాడిపత్రి వంటి మార్కెట్లకు తరలించి, విక్రయిస్తారు. టమోటా స్టాక్ ఎక్కువ వచ్చిన సమయంలో నోసేల్ బోర్డులు పెడుతున్నారని దీంతో చేసేదేమిలేక వారు అడిగిన ధరలకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు తెలిపారు. దీంతో రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు.

ఇటీవల వర్షాలకు తీవ్ర నష్టం

గత మూడు వారాలుగా తెరిపిలేని వర్షాలు కురవడంతో టమోటా పంటకు తీవ్ర నష్టం కలిగింది. ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో పొలంలో టమోటా కాయలను కోసి మార్కెట్‌కు తరలించలేకపో తున్నారు. దీంతో తోటల్లో టమోటాలు మాగిపోయి పంట నష్టపోవాల్సి వచ్చిందని పలువురు రైతులు తెలిపారు. అలాగే వర్షాల వల్ల ఇతర రాష్ట్రాలకు టమోటా ఎగుమతి జరగకపోవడంతో ధరల పతనం మొదలైనట్లు రైతులు తెలిపారు.

ఎగుమతులు లేకనే...



1.5ఎకరాల్లో స్టేకింగ్ పద్ధతిలో టమోటా సాగుచేశా. ఎకరాకు రూ.1.6 లక్షల వరకు పెట్టుబడి వచ్చింది. దిగుబడి బాగా వచ్చిన ధరలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల టమోటాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి కావడం లేదు. దీంతో ధరలు బాగా తగ్గిపోయాయి. రైతులకు పెట్టుబడి కూడా వచ్చే అవకాశాలు లేవు.

-మధుసూదన్‌రెడ్డి, టమోటా రైతు

బాక్స్ రూ.200 పలకడం లేదు



స్టేకింగ్ పద్ధతిలో రెండు ఎకరాల్లో టమోటా సాగుచేశా. మూడు లక్షల పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగా వచ్చింది. అయితే టమోటా బాక్స్ ధర రూ.200 కూడా పలకడం లేదు. ధరలు ఇలాగే కొనసాగితే తీవ్రంగా నష్టపోవాల్సిందే. వర్షాల ప్రభావంతో మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టానుసారంగా టమోటా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. టమోటాకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలి.

-రమేష్, టమోటా రైతు

పెట్టుబడి కూడా రాదు



రెండు ఎకరాల్లో పంట సాగుకు సుమారు రూ.1.8లక్షలు పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగున్నా, ధరలు లేవు. ఫస్ట్ గ్రేడ్ టమోటా 15కిలోల బాక్స్ నెల కిందట రూ.800 ధర పలికింది. ప్రస్తుతం రూ.200 కూడా పలకడం లేదు. ఈ ధరలు కూలీలు, రవాణా ఖర్చులకే సరిపోతాయి. రైతులకు పెట్టుబడి కూడా రాదు. వర్షాలతో టమోటా ఎగుమతి లేకపోవడమే ధరలు పడిపోవడానికి ముఖ్యకారణం.

-శేఖర్, టమోటా సాగురైతు, రాయలచెరువు

పోలీసుల ఒత్తిడితో గుండెపోటు

అనంతలో గిరిజనుడి మృతి

మృతదేహంతో స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన

శింగనమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు, జూదరులతోపాటు ఆ ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన ఓ గిరిజనుడి సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. ఉదయాన్నే స్టేషన్‌కు రావాలని సూచించారు. దీంతో రాత్రంతా ఒత్తిడికి లోనైనా ఆ వ్యక్తి.. ఉదయం స్టేషన్‌కు వెళ్లేందుకు గడప దాటగానే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. పోలీసుల కారణంగానే నిండు ప్రాణం బలైందని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు, శింగనమల మండలం నాగులగుడ్డం తండాలో పేకాట ఆడుతున్నట్లు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో తనిఖీలకు వెళ్లారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని, ఆ ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన రామకృష్ణ నాయక్(38)ను పట్టుకున్నారు. నలుగురి సెల్‌ఫోన్‌లను లాక్కుని, ఉదయాన్నే శింగనమల పోలీస్ స్టేషన్‌కు రమ్మని సూచించి వెళ్లిపోయారు. దీంతో రామకృష్ణ తీవ్ర ఆందోళనకు లోనయ్యాడు. రాత్రంతా నిద్రలేకుండా గడిపాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లేందుకు సోమవారం ఉదయం సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఒత్తిడికి లోనై గడప దాటగానే పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే శింగనమల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు సీపీఆర్ చేశారు. అయినా ప్రాణాలు నిలవలేదు. గుండెపోటు కారణంగా మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలియగానే బాధితుల బంధువులు, తండావాసులు, టీడీపీ, వైసీపీ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ కౌలుట్లయ్య అక్కడికి వెళ్లి బాధితులతో చర్చించారు. విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయినా బాధితులు శాంతించలేదు. మృతదేహాన్ని స్ట్రెచర్‌పై పెట్టుకుని పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లి ధర్నా చేశారు. రామకృష్ణ నాయక్ టీడీపీ కార్యకర్త కావడంతో శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, పార్టీ సీనియర్ నాయకులు మారుతినాయుడు, గుత్తా ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, సత్తి, అనిల్, మాసూల చంద్ర తదితరులు బాధిత కుటుంబం తరఫున పోలీసులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి పరిహారం ఇస్తామని సీఐ హామీ ఇచ్చారు. మృతుడి భార్యకు తండాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టును ఇప్పిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. దీంతో తండావాసులు రామకృష్ణ మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకువెళ్లారు. తండాలో రామకృష్ణ చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు.



శింగనమల పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రామకృష్ణ నాయక్ కుటుంబ సభ్యులు, తండావాసులు

విచారణకు ఆదేశించిన ఎస్పీ: రామకృష్ణ నాయక్ మృతిపై ఎస్పీ జగదీశ్ విచారణకు ఆదేశించారు. పోలీసుల ఒత్తిడి కారణంగానే రామకృష్ణ నాయక్ మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగడంతో ఎస్పీ స్పందించారు. డీఎస్పీ స్థాయి అధికారిచేత పాదర్శకంగా విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు.

పరామర్శించిన ఎమ్మెల్యే: రామకృష్ణ నాయక్ మృతి గురించి టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్ చేసి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


కుంటెన్న(ఫైల్)

ఆత్మకూరు సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. యాలేరు గ్రామానికి చెందిన రైతు కుంటెన్న(38) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కుంటెన్న తనకున్న 8.3 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకునేవాడు. వ్యవసాయంలో తీవ్ర నష్టాలు రావడంతో అప్పులు దాదాపు రూ.10లక్షలకు చేరాయి. వీటిని ఎలా తీర్చేదంటూ తరచూ ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య ముత్యాలక్క, కొడుకు సాయికిషోర్, కుమార్తె వెన్నెల కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లాప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తా

● మహిళా కూలీ మృతి, నలుగురికి గాయాలు

కణేకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడచేడు వద్ద సోమవారం వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తా పడి మహిళా కూలీ మృతిచెందగా.. నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని తుంబిగనూరుకు చెందిన మహిళా కూలీలు గౌరమ్మ, వనజాక్షి, చిన్నక్క, గంగమ్మ, సుజాతమ్మ సోమవారం ఉదయం గరుడచేడు వద్ద ఓ పొలంలో వేరుశనగ నూర్పిడి పనులకు వెళ్లారు. వీరంతా ట్రాక్టర్ వెనుకభాగాన కట్టుకున్న నూర్పిడి యంత్రంపై కూర్చున్నారు. గరుడచేడు, మీండ్లపల్లి వద్ద ప్రధాన రహదారి నుంచి పొలాలకు వెళ్లే దారివైపు తిప్పగా నూర్పిడి యంత్రం బోల్తాపడింది. ప్రమాదంలో గౌరమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. వారందరినీ కణేకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడిని మోసగించిన యువకుడు

● ఏటీఎం నుంచి రూ.35 వేలు కాజేసిన వైనం

గోరంట్ల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): వృద్ధుడిని మోసగించి ఏటీఎం నుంచి ఓ యువకుడు రూ.35వేలు కాజేసిన సంఘటన సోమవారం గోరంట్లలో జరిగింది. పుట్టపర్తి మండలం పెడబల్లికి చెందిన 65 ఏళ్ల గ్యాగేనాయక్ గోరంట్లలోని ఏటీఎం వద్దకు వచ్చి అక్కడున్న యువకుడిని రూ.10వేలు డ్రాచేసి ఇవ్వాలని కోరాడు. రూ. పదివేలు ఒక్కసారిగా రావని, రూ. ఐదువేల వంతున రెండుమార్లు డ్రా చేసి ఇస్తానని చెప్పి, డ్రాచేసి ఇచ్చాడు. అనంతరం రెడ్డెప్పనాయుడు అనే పేరు ఉన్న మరో ఏటీఎం కార్డును వృద్ధుడి చేతిలో పెట్టి యువకుడు జారుకున్నారు. మళ్లీ నగదు డ్రా చేయడానికి ప్రయత్నించినా రాకపోవడంతో వృద్ధుడు బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ అధికారులతో ఆరా తీయగా తనఖాతా నుంచి రూ.35వేలు డ్రా చేసినట్లు గుర్తించాడు. మోసంతో తన సొమ్ము కాజేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో సీసీ పుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య


ఈసారి సత్య (ఫైల్)

యాడికి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీకి చెందిన ఈసారి సత్య (23) సోమవారం సాయంత్రం ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు యాడికిలోని నారాయణస్వామి కాలనీకి చెందిన తిరుపాలు, రమణమ్మ దంపతులకు నలుగురు కుమారులు ఉన్నారు. తిరుపాలు గతంలోనే మృతి చెందాడు. మొదటి, రెండో కుమారులు తిరుపతిలో ఉంటున్నారు. మూడో కుమారుడు ధర్మ, నాలుగో కుమారుడు సత్య తల్లి వద్దనే యాడికిలో ఉంటున్నారు. అవివాహితుడైన సత్య భవన నిర్మాణ పనులకు వెళ్లేవాడు. ఏమైందో ఏమో కాని సోమవారం సాయంత్రం ఇంటివద్ద ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి సంపులో పడి యువకుడి మృతి

శెట్టూరు, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లిలో నీటి సంపులో పడి ముత్రాసి తరుణ్ (18) సోమవారం మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన మేరకు చిన్నంపల్లి గ్రామానికి చెందిన ముత్రాసి తరుణ్ ఉదయం నుంచి పొలంలో వేరుశనగ కట్టె తరలించే పనులు చేశాడు. మధ్యాహ్న సమయంలో ఓ వ్యవసాయ పొలంలో నీటి సంపు వద్ద కాళ్లు చేతులు కడుక్కుని వస్తానని వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి పోయాడు. ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందాడు. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో బంధువులు అక్కడికి వెళ్లి చూడగా శవమై కనిపించాడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు సీఈఓ శివశంకర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించి, తీర్మానాలు చేయనున్నారు.

టమోటా కిలో రూ.15

అనంతపురం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.15తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.8, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3వేల టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధరరూ.11వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 593టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కిలేడీలు..!

- వేర్వేరు ప్రాంతాల్లో 14 రోజుల వ్యవధిలో 10 చోరీలు
- అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా అరెస్టు
- రూ.7.5 లక్షల నగదు, కారు స్వాధీనం

● బ్యాంకుల వద్ద రెక్కీ ● ఖాతాదారులను వెంబడించి.. నగదు అపహరణలు


పట్టుబడిన కారు, నగదుతో డీఎస్పీ నరసింగప్ప, సీఐ శేఖర్, సిబ్బంది

గోరంట్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ముఠాగా ఏర్పడ్డారు. బ్యాంకుల వద్ద రెక్కీ నిర్వహించడం, పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకుని వెళ్తున్న వారిని వెంబడించి ఆ సొమ్ము కాజేయడం మొదలెట్టారు. అలా.. 14 రోజుల వ్యవధిలో వేర్వేరు రాష్ట్రాల్లో ఏకంగా 10 చోరీలు చేశారు. అందుకోసం రెండు కార్లను తీసుకుని, ఇద్దరు డ్రైవర్లను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఆఖరుకు ఆ మహిళా ముఠాను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పోలీసులు పట్టుకున్నారు. అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా ఆట కట్టించారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గర్ జిల్లా కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన దీప్ మాలాబాయి, ఫరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, కారు డ్రైవర్ ప్రదీప్ సిసోడియా పోలీసులకు పట్టుబడిన వారిలో ఉన్నారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప.. దొంగల ముఠా అరెస్టు వివరాలను సోమవారం వెల్లడించారు. కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రెండు కార్లను తీసుకుని, చోరీలు మొదలెట్టారు. ఈనెల 3న గోరంట్ల మండలం కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు స్టేట్ బ్యాంకు(గోరంట్ల శాఖ)లో రూ.3.80 లక్షల నగదు డ్రా చేసుకుని, ద్విచక్రవాహనం సైడ్ బ్యాగులో పెట్టుకుని బయల్దేరాడు. మధ్యలో ఓ దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆగాడు. ఆయనను బ్యాంకు వద్ద నుంచే రెండు కార్లలో మహిళా ముఠా వెంబడించింది. దుస్తులు కొనుగోలు చేస్తుండగా.. ద్విచక్రవాహనంలోని రూ.3.80 లక్షల నగదును చోరీ చేశాయి. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. దీప్ మాలాబాయి, ఫరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, మరో ఇద్దరు మహిళలు, ప్రదీప్, మరో కారు డ్రైవర్ ముఠా చోరీ చేసినట్లు గుర్తించారు. గోరంట్ల మండలంలో జాతీయర రహదారి పక్కనేకె హోటల్ వద్ద ఆదివారం ఐదుగురు మహిళలు, కారు డ్రైవర్ ప్రదీప్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో వరుస చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా గత నెల 21 నుంచి ఈనెల 3వ తేదీ మధ్య ఏకంగా పది చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. కడప జిల్లా పులివెందుల, జమ్మలమడుగులో మూడు, తెలంగాణలో మూడు, నంద్యాల జిల్లా, కర్ణాటక, ఒడిశాలో ఒకటి, మరోచోట ఒకటి చొప్పున మొత్తం పది చోరీలు చేసి, రూ.12.59 లక్షలు అపహరించారు. వారి నుంచి మొత్తం 7.50 లక్షలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు.. కారుకు సైరన్ ఏర్పాటు చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలింది. అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య పేర్లను రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో చొరవ చూపిన కానిస్టేబుళ్లు వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, హోంగార్డు ప్రియాంకకు నగదు బహుమతులను డీఎస్పీ అందజేశారు. ముఠాలో మరో ఇద్దరు మహిళలు, డ్రైవర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

మోక్షగుండం అడుగుజాడల్లో నడవాలి

● పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ రెడ్డి


ఇంజనీర్స్ డేలో పాల్గొన్న పీఆర్ ఇంజనీర్లు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) ఇంజనీరింగ్ మేధావి, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో ప్రతి ఇంజనీర్ పయనించాల్సిన అవసరం ఉందని పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక జడ్పీ ఆవరణలోని ఈఈ కార్యాలయంలో ఇంజనీర్స్‌డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈఈ ప్రభాకర్‌రెడ్డి మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో పీఏ టూ ఈఈ గురుమూర్తి రావు, ఏఈ వేంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ విభాగంలో..

జడ్పీ ఆవరణలోని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ సబ్‌డివిజన్-1 డీఈ లోకన్న, సబ్‌డివిజన్-2 డీఈ రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విభాగంలోని పలువురు ఇంజనీర్లతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


క్వాలిటీ కంట్రోల్ విభాగంలో నివాళులు అర్పిస్తున్న డీఈలు లోకన్న, రవీంద్ర

పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణానికి నిధుల మంజూరు

హిందూపురం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): హిందూపురంలోని పాతపట్టుగూళ్ల మార్కెట్ సముదాయంలో నూతనంగా మార్కెట్ నిర్మించడానికి రూ.8కోట్లు నిధులు మంజూరుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. 2024-25లో సిల్క్ సమగ్ర-2 పథకం కింద జనరల్ కేటగిరీ నిధుల మంజూరు చేశారు. ఇంతకు ముందే నాలుగు కోట్లు మంజూరు చేయగా ఆ నిధులు సరిపడవని పట్టురైతుల తరఫున ఎమ్మెల్యే బాలకృష్ణ ఎనిమిది కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో కేంద్రం వాటా కింద నాలుగుకోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పట్టుపురుగుల అభివృద్ధి శాఖ నుంచి మరో నాలుగుకోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఉన్న పాత మార్కెట్‌ను కూల్చివేసి దానిస్థానంలో నూతనంగా అత్యాధునిక సదుపాయాలతో నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి రోజు మంగళవారం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి, ఈనెల 18న యాడికి, 19న రాప్తాడు మండలం గాండ్లపర్తి, ఈనెల 20న కూడేరు మండలం కమ్మూరు, ఈనెల 23న ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం, ఈనెల 27న బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి, ఈనెల 30న గుత్తి మండలం తొండపాడులో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించే విషయాన్ని ఆయా ప్రాంతాల్లో ముందే రోజే టామ్‌టామ్ వేయించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

19న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి బాల, బాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈనెల 19న నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, కన్వీనర్ రవికుమార్, కో కన్వీనర్ సుదర్శన్ తెలిపారు. జిల్లా స్థాయిలో అండర్-14, 16, 18, 20 బాల, బాలికల కేటగిరిలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెలాఖరులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు అర్హులవుతారన్నారు.

నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్టాపింగ్

గుంతకల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా బెంగళూరు-నాందేడ్-బెంగళూరు మధ్యన నడిచే ఎక్స్‌ప్రెస్ (16593/94) రైలుకు నగరూరు రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-ఆదోని రైల్వే సెక్షన్‌లో ఉన్న నగరూరు స్టేషన్‌లో నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రయోగాత్మకంగా ఒక నిమిషం నిలపనున్నట్లు తెలియజేశారు. బెంగళూరు-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (16593) రైలును ఈ నెల 18 నుంచి, దీని తిరుగు ప్రయాణపు రైలు (16594)ను 19 నుంచి నగరూరులో నిలపనున్నట్లు వివరించారు.

వృద్ధురాలి నేత్రాలు దానం

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పులకుంట గ్రామానికి చెందిన అక్కమ్మ (90) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు.గ్రామ సర్పంచ్ కొల్లాపురమ్మ అత్త అయిన అక్కమ్మ ఆదివారం మృతి చెందగా రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థకు సమాచారం ఇచ్చారు. సంస్థ ప్రతినిధులు గ్రామానికి చేరుకుని అక్కమ్మ నేత్రాలను సేకరించారు.

అయినా.. తప్పిదాలా..?

(5వ పేజీ తరువాయి)

ఉన్నట్లు కాల్‌లెటర్ పంపారు. ఆయన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రాగా.. లేటెస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోసం జిల్లా సర్వజన ఆస్పత్రికి విద్యాశాఖ పంపింది. అక్కడకు వెళ్లిన ఆయన.. వైద్యుడు పరీక్ష చేయకనే వెళ్లిపోయారు. దీనిపై విద్యాశాఖకు డాక్టర్ సమాచారం ఇచ్చారు. దీంతో విద్యాశాఖ అధికారులు సైతం రాష్ట్రశాఖకు శ్రీనివాసులు పరీక్ష చేయించుకోకుండా వెళ్లిపోయారని నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనివాసులు.. డీఈఓ కార్యాలయానికి వచ్చి.. తాను వెళ్లిపోలేదనీ, సర్టిఫికెట్లు ఇవ్వడానికి పరిశీలన కేంద్రానికి వెళ్లానని చెప్పుకున్నారు. తమ చేతుల్లో ఏమీలేదని జిల్లా అధికారులు చెప్పారు. దీంతో ఆయన రాజధానికి వెళ్లి, విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి న్యాయం చేయాలని వేడుకున్నారు. దీంతో కమిషనర్ సీరియస్‌గా స్పందించారు. శ్రీనివాసులును దగ్గరుండి డాక్టర్ వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఆ మేరకు ఈనెల 4వ తేదీన డీఈఓ ప్రసాద్‌బాబు, సూపరింటెండెంట్ ఆదినారాయణ, ఏపీ మంజునాథ్ స్వయంగా శ్రీనివాసులును ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యుడితో పరీక్ష చేయించారు. శ్రీనివాసులుకు మానసిక జబ్బులేదనీ, ఎంఐకి అనర్హుడని వైద్యుడు నివేదిక ఇచ్చారు. ఆ రిపోర్టును విద్యాశాఖ అధికారులు స్వయంగా తెచ్చుకున్నారు. అయినా కురుబ శ్రీనివాసులు సోషల్ సబ్జెక్టులో ఎంఐ కేటగిరీ కింద ఎంపికైనట్లు తుది జాబితాలో పేరు వచ్చింది. దీనిపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

అధిక మార్కులు వచ్చినా..

ఎస్సీ గ్రేడ్-2 కేటగిరీలో సోషల్ సబ్జెక్టులోనాలుగు పోస్టులు ఉన్నాయి. ఎస్ నాగరాజు అనే అభ్యర్థి 76.88 మార్కులతో 43వ ర్యాంకులో నిలిచారు. ఈయన ఓపెన్(ఓసీ) జనరల్‌లో ఎంపికయ్యారు. ఆ తర్వాత మరో నాగరాజు అనే అభ్యర్థి 76.82 మార్కులతో 44వ ర్యాంకులో ఉన్నారు. మిగిలిన మూడింటిలో తొలి పోస్టుకు నాగరాజును ఎంపిక చేయాలి. అలాకాకుండా 75.06 మార్కులు వచ్చినసూరి, 74.83 మార్కులు సాధించిన మహేష్‌ను ఎంపికచేసి జాబితాలో ముందుపెట్టారు. 76.82 మార్కులతో రెండోస్థానంలో ఉన్న నాగరాజుకు నాలుగో అభ్యర్థిగా ఫైనల్ జాబితాలో అవకాశం ఇవ్వడంతో ఆయన షాక్‌కు లోనయ్యారు. డీఈఓ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు.

డీఈఓ మెడకు ఉచ్చు

ఎంఐ కేటగిరీలో అనర్హుడని డాక్టర్ సర్టిఫికెట్ ఇచ్చినా సోషల్ సబ్జెక్టులో ఎంపిక జాబితాలో ఆయన పేరు ఉండడం డీఈఓ మెడకు చుట్టుకుంటోంది. ఈ అక్రమ వ్యవహారం, నిర్లక్ష్యంపై కమిషనర్ విజయరామరాజు, ఆర్జేడీ శామ్యూల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ఐదుసార్లు సర్టిఫికెట్ల పరిశీలన చేయించినా ఇలా ఎందుకు జరిగింది, ఇందులో ఎవరి పాత్ర ఉందనీ, వారిని గుర్తించే పనిలో డీఈఓతోపాటు కమిషనర్, ఆర్జేడీ నిమగ్నమయ్యారు. ఈ వ్యవహారంలో ఎవరిపై వేటు పడతుందోనని విద్యాశాఖలో ఉత్కంఠ నెలకొంది.

కాల్ లెటర్లు వచ్చినా పేరు లేదు..

డీఎస్సీ కాల్‌లెటర్ వచ్చిందనీ, సర్టిఫికెట్ల పరిశీలనకు కూడా హాజరయ్యామనీ, అయినా తుది జాబితాలో పేరులేదని చాలా మంది అభ్యర్థులు డీఈఓ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. జిల్లాలో 773 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు వచ్చాయి. వీరందరి సర్టిఫికెట్లను ప్రత్యేక కమిటీలు పరిశీలించాయి. 807 పోస్టులకుగాను 755 మంది అభ్యర్థులనే ఫైనల్ జాబితాలో ప్రకటించారు. దీంతో సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చి ఇపుడు జాబితాలో పేర్లులేని అభ్యర్థులు డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రాలు ఇస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఈఓ స్పందిస్తూ.. రెండు, మూడు పోస్టులకు ఎంపికైనఅభ్యర్థులు ప్రాధాన్యత ప్రకారం ఎంపికై ఉంటారనీ, ఆ క్రమంలో కొంతమందికి అవకాశం లేకుండా పోతుందన్నారు. అలాంటి వారి కోసం కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, అనుమానాలను నివృత్తి చేయించారు.

పశువులకు టీకా వేయించండి

● పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్


రాప్తాడులో ఆవుకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశువైద్యాధికారి

అనంతపురం అర్బన్/రాప్తాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాలి కుంటు వ్యాధి సోకకుండా పశువుల యజమానులు టీకా వేయించాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్ సూచించారు. సోమవారం రాప్తాడులో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి అనంతపురం డీడీ రమేష్‌రెడ్డి, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబులతో కలిసి పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్ హాజరై పలు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. అక్టోబరు 15వతేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తామన్నారు. జిల్లాకు 320500 గాలికుటుంబ వ్యాధి నివారణ టీకాల డోస్‌లను అందుబాటులో ఉంచామన్నారు. టీకా వేసిన పశువుల చెవులకు పోగులు వేసి, ట్యాగ్ రూపంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. అనంతరం ఆత్మకూరు మండలం గొరిదిండ్లలో పశువుల గాలి కుంటు టీకాలకు సంబంధించి రక్తన మూనాలు సేకరించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్లు శృతి, తేజస్విని, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారిత వీర్యం వినియోగాన్ని ప్రోత్సహించాలి

జిల్లాలో లింగ నిర్ధారిత వీర్యం వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మంగళవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. అక్టోబరు 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కృత్రిమ గర్భధారణ సాంకేతిక నిపుణులు తప్పనిసరిగా ఆయా కార్యక్రమాలకు హాజరై లింగ నిర్ధారిత వీర్య గర్భధారణ ప్రాముఖ్యతను రైతులకు వివరించాలన్నారు.

పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా టెన్నిస్‌బాల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఉమ్మడి జిల్లా టెన్నిస్‌బాల్, బీచ్ వాలీబాల్, మోడ్రన్ పెంథలాన్ క్రీడాకారులను ఎంపిక చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను సోమవారం వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. టెన్నిస్‌బాల్ అండర్- 14, 17, బాల, బాలికల కేటగిరిలో 20మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. బీచ్‌వాలీబాల్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాలలో 12మందిని ఎంపిక చేశారు. మోడ్రన్ పెంథలాన్ అండర్-17, 19 బాల, బాలికల్లో 30మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డైట్ కాలేజీ పీడీ రామకృష్ణ, హెచ్‌ఎం వీరన్న, ఎస్‌జీఎఫ్ సభ్యులు పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, పీఈటీలు నిరంజన్ రెడ్డి, ఓబుళేసు, సమీరా, రేఖ, లీలారాణి, ప్రత్యూష పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు పెరవలి విద్యార్థులు

శింగనమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు పెరవలి జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అనంతపురంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండర్-19 బాలురు విభాగంలో రాజ్‌పుల్లయ్య అండర్-17 బాలురు విభాగంలో బి. రాఘవేంద్ర, ఎస్ మోహన్‌నాయక్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం హరినాథ్, పీడీ నరసింహారెడ్డి తెలిపారు.

పరిటాల శ్రీరామ్‌కు భద్రత కల్పించండి

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

ధర్మవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు 2+2 భద్రత కల్పించాలని హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. టీడీపీ హయాంలో పరిటాల శ్రీరామ్‌కు 2+2 భద్రత ఉండేది. వైసీపీ అధికారం చేపట్టాక టీడీపీ నేతలను టార్గెట్ చేసింది. అందులో భాగంగానే పరిటాల శ్రీరామ్‌కు భద్రతను పూర్తిగా తొలగించింది. దీనిపై అప్పట్లో పరిటాల శ్రీరామ్.. హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. పరిటాల శ్రీరామ్‌కు 2+2 భద్రత కల్పించాలని ప్రభుత్వానికి ఆదేశించింది.

దరఖాస్తు గడువు పొడిగింపు

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బార్‌ల లైసెన్స్ కోసం దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. 2025-28 నూతన బార్ పాలసీలో భాగంగా గతనెల 30న లాటరీ నిర్వహించగా మిగిలిన 9బార్‌లకు ప్రభుత్వం ఈ నెల 12న రీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 17న ఆఖరి తేదీ అన్నారు. అనంతపురంలో 3, గుంతకల్లులో 2, గుత్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి రాయదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయన్నారు. 17 సాయంత్రం 6 గంటల్లోగా దరఖాస్తు చేయాలన్నారు. 18న లాటరీ తీస్తామని ఆయన స్పష్టం చేశారు.

మంత్రి ధర్మవరం పర్యటన రద్దు

ధర్మవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ధర్మవరం పర్యటన మంగళవారం రద్దు అయినట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్, ఇతర ముఖ్యమైన అధికారిక కార్యక్రమాల వల్ల మంత్రి షెడ్యూల్ మారిందన్నారు. త్వరలోనే మరో తేదీని ఖరారు చేసి మంత్రి ధర్మవరం పర్యటన నిర్వహించనున్నట్టు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

ధర్మవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ జన్మదినం పురస్కరించుకుని పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు, యువత, సామాజిక సేవా కార్యకర్తలు రక్తదానం చేశారు. వారికి స త్యన్నసేవ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన వారిని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ఆప్యాయంగా పలుకరించారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

ధర్మవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దయ్యగుట్టలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలోని నగదు ఆదివారం రాత్రి చోరీ అయినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయానికి ఉన్న తాళాలను పగలకొట్టి ఆలయంలోకి ప్రవేశించారన్నారు. హుండీని పగులకొట్టి డబ్బు ఎత్తుకెళ్లారన్నారు. ప్రతి 15రోజులకొకసారి హుండీని లెక్కిస్తామని, దాదాపు రూ.3 వేల వరకు ఎత్తుకెళ్లి ఉంటారని వారు పేర్కొన్నారు. గతంలోనూ ఇలా చోరీ చేశారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోండి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి సోమవారం ప్రకటనలో కోరారు. 2025-26కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆటో, మోటార్ క్యాబ్, మ్యాక్సీ కాబ్ ఉన్న వారికి యేడాదికి రూ.15వేలు ఆర్థికసాయం అందజేస్తుందన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గాండ్లపెంట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ సోమవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గతంలో ఓ వ్యక్తితో తనకు వివాహమైందని, అయితే విడాకులు తీసుకున్నామని ఆమె తెలిపారు. తిరిగి మరో వ్యక్తి తనను ప్రేమించి పెళ్లిచేసుకుంటానని, నమ్మించాడన్నారు. పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెంది విషద్రావకం తాగినట్లు తెలిపారు.. ఈవిషయంపై తనకు న్యాయం చేయాలని కోరారు

అటు పీజీఆర్ఎస్... ఇటు మండల మీట్

● ఇబ్బందులు పడ్డ అధికారులు, ప్రజలు


మండల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో మండల స్థాయి అధికారులందరూ మధ్యాహ్న భోజనం విరామం వరకు పాల్గొన్నది జగమెరిగిన సత్యం. మూడునెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలోనూ మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించాల్సి ఉంటుంది. ఈ రెండు కార్యక్రమాలను సోమవారం ఒకే రోజు నిర్వహించడం పట్ల కొందరు అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులతో పాటు సమస్యలపై గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఎంపీడీఓతో పాటు పలువురు అధికారులు లేకపోవడంతో కొంత ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఎంపీడీఓ రంగారావును వివరణ కోరాగా... మండల సర్వసభ్య సమావేశానికి 90 రోజుల గడువు ముగుస్తుందనే ఉద్దేశ్యంతో.... మండలంలోని ప్రజాప్రతినిధుల అనుమతితోనే సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు.

ఎస్పీగా రత్న సేవలు మరువలేనివి

● మాజీ మంత్రి పల్లె


ఎస్పీ రత్నను సన్మానిస్తున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 15 ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా వి. రత్న సేవలు మరువలేనివని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కొనియాడారు. జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళుతున్న ఎస్పీ రత్నకి మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఎస్పీ క్యాంపు కార్యాలయలో బాబా చిత్రపటాన్ని, పుష్పగుచ్ఛాన్ని అందచేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రామంజినేయులు, నాయకులు రత్నప్పచౌదరి, సామకోటి ఆదినారాయణ, ఓబులేసు,వడ్డెర కార్పొరేషన్ డైరక్టర్ ఓలిపి శ్రీనివాసులు, కొత్తచెరువు, బుక్కపట్నం కన్వీనర్లు రామకృష్ణ, మల్రెడ్డి, గంగాధర్ నంజప్ప మాజీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో ఏపీ ఆదర్శం

●ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


కేరళ ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక సాధికారతలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలు స్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన రెండు రోజుల జాతీయ పార్లమెంటరీ శాసనసభ కమిటీల తొలిమహిళా జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడారు. తిరుపతిలో మహిళా సాధికారతపై తీర్మానం ఆమోదించడం చరి త్రాత్మకం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వివిధ రంగాల్లో మహిళల చేర్పులో ముందంజలో ఉందని ఆమె తెలిపారు. వివిధ రంగాల్లో మహిళల పెట్టుబడులతో అపారమైన మానవ వనరులను వెలికి తీయ గలమని అన్నారు. ఈ సందర్భంగా పలు రాష్ట్రాల మహిళా ప్రజాప్రతినిధులతో పల్లె సింధూరారెడ్డి చర్చించారు. కేరళలో పుట్టి పెరిగి ప్రస్తుతం పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తరఫున అసెంబ్లీలో గళమెత్తుతున్న సింధూర రెడ్డిని వారు ప్రత్యేకంగా అభినందించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే చేసిన ప్రసంగాలు సోషల్‌మీడియాలో చూసిన కేరళ మహిళా ప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

లో ఓల్టేజ్ సమస్యపై నిరసన

ముదిగుబ్బ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): లోఓల్టేజీతో తమ ఇళ్లలోని విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని మండల కేంద్రంలోని బాలాజీ కాలనీ సమీపంలో ఉన్న వినియోగదారులు మండి పడ్డారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు విద్యుత్ శాఖ సిబ్బంది అదనపు కనెక్షన్లు ఇవ్వడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. సమస్యను పరిష్కరించాలంటూ సోమవారం రాత్రి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని పలు వీధులలో ఇదే సమస్య నెలకొందని, ఇప్పటికైనా కదిరి విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎన్టీఆర్ వైద్యసేవలపై వైసీపీ దుష్ప్రచారం

● పరిటాల శ్రీరామ్


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవల విషయంలో ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 10 మందికి రూ.9.95లక్షలు సీఎం సహాయనిధి మంజూరైంది. ఆ చెక్కులను ఆయన సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఎన్టీఆర్ వైద్యసేవలు అందక ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారన్నారు. కొన్ని రోజులుగా మెడికల్ కళాశాలల నిర్మాణాలు, ఎన్టీఆర్ వైద్యసేవల విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మ వద్దన్నారు. నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, ఫణి కుమార్, సంధా రా ఘవ, నాగూర్‌హుస్సేన్, జింకా పురుషోత్తం, కొత్త పేట ఆది, విజయసారథి, కేతా శీన, పోతుకుంట రవి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పట్ల నిర్లక్ష్యం వద్దు

●తాడిమర్రి: రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డితో పలు అంశాలపై చర్చించారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యవ వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌కు వెళ్లిన పరిటాల శ్రీరామ్‌కు పలు వురు రైతులు వివిధ సమస్యలను విన్నవించారు. స్పందించిన శ్రీరామ్ ఈనెల 30 లోగా ఇక్కడే పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించాలని లేదంటే ఒకటో తేదీన కలెక్టరేట్‌లో తెలియజేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మహిళను దూషించాడని వ్యక్తిపై దాడి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తప్పతాగి మహిళను దూషిస్తున్నాడని ఓ వ్యక్తిపై ఆమె బంధువులు దాడిచేశారు. మున్సిపల్ పరిధిలోని కర్ణాటకనాగేపల్లికి చెందిన సాయమ్మను అదే గ్రామానికి చెందిన వెంకటేష్ తప్పతాగి ప్రతిరోజు దూషించేవాడు. దీంతో ఆమె బంధువులు, మరోయువకుడు సుధాకర్ సోమవారం రాత్రి వెంకటేష్‌పై కత్తితో దాడిచేశారు. ఈ ఘటనలో గాయపడిన వెంకటేష్‌ను ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసినట్లు ఎస్సై లింగన్న తెలిపారు.

మురుగునీటి నిల్వపై చర్యలు

ఆంధ్రజ్యోతి స్పందన

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూరులో గ్రామ నడిబొడ్డున ఉన్న మురుగుకాలువలో నీరు నిల్వ ఉండి అపరిశుభ్రత నెలకొంది. దోమల బెడదతో ప్రజలు అల్లాడిపోయే వారు. అదేవిధంగా చిగిచెర్ల గ్రామంలో రోడ్డుపై మురుగునీరు పారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యలపై ఈ నెల 11న ఆంధ్రజ్యోతిలో 'డ్రైనేజీలు అస్తవ్యస్తం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విది తమే. దీనిపై ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్ స్పందించి గ్రామ సర్పంచ్‌లతో మాట్లాడారు. వెం టనే ఆయా గ్రామాల్లోని డ్రైనేజీ కాలువల్లో చెత్తా చెదారాన్ని ఎక్స్ వేటర్‌తో తొలగించారు. మురుగునీరు సజావుగా వెళ్లేలా చేశారు.

వెంటనే ఐఆర్ ప్రకటించాలి: ఏపీటీఎఫ్

ధర్మవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్ డీఏలు, ఐఆర్ వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి, బలరాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకపోతే దశలవారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు, తిప్పన్న, వాసుకుమార్, శంకరనారాయణ, బాలయ్య, హేమంత్, అమానుల్లా, ఓబుళేశు, నాగశేఖర్, చెన్నుడు, షణ్ముఖ, జగదీశ్, సుదర్శన, కుళ్లాయప్ప, మల్లికార్జున, రమేశ్, నాగరాజు, వెంకటేశ్, శ్రీనివాసరెడ్డి, వెంకట రాముడు, రామాంజినేయులు, వేణు పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, వారిని బోధనకే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీటీ ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మురళీక్రిష్ణకు వినతిపత్రం అందించారు.

'సర్వేల నుంచి విముక్తి కలిగించాలి'

ధర్మవరం/బత్తలపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తిరిగి చేసే సేవలు, సర్వేల నుంచి గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగుల కు విముక్తి కలిగించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తమకు సర్వేల నుంచి విముక్తి కల్గించాలంటూ చేపట్టబోయే నిరసన కార్యక్రమాలపై సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణకు వారు వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు మహబూబ్‌బాషా, రంగనాయకులు, శివారెడ్డి, ఫల్గుణ, నరేంద్ర, భాస్కర్‌రెడ్డి, రమేశ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బత్తల పల్లి ఎంపీడీఓ కార్యాలయంలో జేఏఈ నాయకులు ఎంపీడీఓ నరసిం హనాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు సూర్య, గంగాధర, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: సర్వేల పనిభారం తగ్గించకపోతే సామూహిక సెలవుపై వెళతామని పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పార్థసారథికి వినతిపత్రం అందించారు. పంచాయతీ మహమ్మద్‌అలీ, దనుంజయ రెడ్డి భాస్కర్, రాంప్రసాద్, రమేష్, జాస్మిన్, వసుంధర, ఆంజనేయుల, కేదార్‌నాథ్ ఉన్నారు.

సీఐటీయూ నుంచి మహిళా నేత తొలగింపు

కదిరి అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఐటీయూలో పనిచేస్తున్న మహిళనాయకురాలు మాబున్నీసాను యూనియన్ నుంచి తొలగించినట్లు సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనియన్ పద్ధతులకు భిన్నంగా, సంఘం విచ్ఛిన్నానికి పాల్పడుతున్న ఆమెను తొలగిస్తూ సోమవారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించామని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ఐముక్తేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధిచెందిన ఐముక్తేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పురస్కరించుకుని అర్చకులు కన్నాస్వామి, మూర్తిస్వామి ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రామాల్లో సంకీర్తన, సత్సంగం



సంకీర్తన, సత్సంగం నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

పెనుకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని సత్తార్‌పల్లి, మహదేవ్‌పల్లి, తిమ్మాపురం, గుట్టూరు తదితర గ్రామాల్లో సత్సంగం నిర్వహించారు. గ్రామస్థులందరినీ శతజయంతి ఉత్సవాలకు తరలిరావాలని ఆహ్వానించారు. సత్యనారాయణమూర్తి, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



కొడికొండ చెక్‌పోస్టు ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

చిలమత్తూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అక్రమ మద్యం, గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సరిహద్దులోని కొడికొండ చెక్‌పోస్టు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన వాహనాల రాకపోకలను నిరంతరాయంగా నిఘా ఉంచే సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. కర్ణాటక నుంచి అక్రమంగా తరలివచ్చే మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై నిఘా ఉంచాలన్నారు. ఆయన స్వయంగా కర్ణాటక నుంచే వచ్చే వాహనాలను ఆపి తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, హిందూపురం సీఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టీచర్లకు సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

పరిగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం హిందీదివస్‌ను ఘనంగా నిర్వహించారు. హిందీ ప్రాముఖ్యత గురించి, హిందీని జాతీయ భాషగా ఎప్పుడు గుర్తించారో విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు కరణం గురురాజారావు, మదన్‌మోహన్, హిందీ ఉపాధ్యాయురాలు హెప్సీబాగ్రేస్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ.20వేలు విలువచేసే పోడియంను హెప్సిబాగ్రేస్ విరాళం అందించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగునీరు వదులుతున్న వారిపై చర్యలు

గోరంట్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయి కాలనీలో కలెక్టర్ బిల్డింగ్ తదితర నివాసాల వారు మురుగునీరు రోడ్డుపైకి వదులుతుండడంతో అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. చాలా కాలంగా మురుగునీరు ప్రవహిస్తూ, ఆ ప్రాంతం దుర్గంధభరితంగా మారింది. ఆ వాసన భరించలేక స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ దేవదానం, పంచాయతీ ఈఓ సుబ్రహ్మణ్యం, సాయి సంజయ్ తమ సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. కలెక్టర్ బిల్డింగ్‌తోపాటు, మరో మూడు నివాసాలనుంచి రోడ్డుపైకి నీరు వదులుతుండడంతో సిబ్బందితో మురుగునీరు వచ్చే పైపులను బంద్ చేయించారు.

గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం గర్భిణులకు ముస్లింలు అన్నదానం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వైద్యులు ఆయిషా తస్లీమా, ఓంకార్, సీహెచ్ఓ రవీంద్ర, అక్రంబాషా, అన్సార్, షాషా, షెక్షా, మహమ్మద్, త్యాగి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన మహిళ(35) సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. భార్యాభర్తల మధ్య నెలకున్న వివాదం కారణంగా మనస్థాపానికి గురైన ఆమె పెట్రోల్ తాగి అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

అంగన్‌వాడీల విజయోత్సవ ర్యాలీ



కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీలు

గుడిబండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం అంగనవాడీ కార్యకర్తల విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం మినీ అంగనవాడీలను మెయిన్ అంగనవాడీలుగా ఏర్పాటుచేసి ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడంతో అంగనవాడీ కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాయలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లను పంచుకున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కమలమ్మ, కార్యకర్తలు మహదేవమ్మ, సుజాతమ్మ, లక్ష్మీదేవి, నాగవేణి, ఈరమ్మ, దేవీరమ్మ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఇన్‌చార్జిల పాలన..?

● రెగ్యులర్ తహసీల్దార్ కోసం ఎదురుచూపు
● సమస్యలతో కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు



అధికారుల రాక కోసం వేచి ఉన్న ప్రజలు

చిలమత్తూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి రెగ్యులర్ తహసీల్దార్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్లుగా కార్యాలయంలో ఇన్‌చార్జి అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో ప్రజలు విసిగిపోతున్నారు. పెనుకొండ్ డివిజన్‌లో చిలమత్తూరు మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉంటున్నాయి. ప్రధానంగా మండలం 2005 నుంచి సెజ్ పరిధిలోకి రావడంతో భూసేకరణ, పరిహారం వంటి సమస్యలు ఉంటూనే ఉన్నాయి. దానికి తోడు రియల్ఎస్టేట్ వ్యాపారాలు జోరుగా ఉండటంతో భూసమస్యలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. రెండేళ్లుగా కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దార్ వచ్చినా పట్టుపని నెలరోజులైనా పనిచేయడం లేదు. దాంతో కిందిస్థాయి ఉద్యోగులకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడం, లేదా పక్క మండలాల తహసీల్దార్లకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో మండల ప్రజలు భూసమస్యల పరిష్కారం కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇటీవల రెగ్యులర్ తహసీల్దార్‌గా నటరాజ్‌ని నియమించారు. ప్రస్తుతం టేకులోడు రెవెన్యూ గ్రామంలో భూసేకరణ జరుగుతోంది. దానికి తోడు కోడూరు, శెట్టిపల్లి, చిలమత్తూరు గ్రామాల్లో భూసేకరణ పనులకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ తరుణంలో తహసీల్దార్ నటరాజ్ ఆరోగ్య సమస్యలతో 20 రోజులుగా సెలవులో ఉన్నారు. దాంతో హిందూపురం తహసీల్దార్ వెంకటేశులుకు ఇన్‌చార్జి బాధ్యతలు అపగించారు. ఆయన హిందూపురం మండలంలో ప్రజల సమస్యలతో బీజీగా ఉంటున్నారు. ఇన్‌చార్జి అధికారిగా చిలమత్తూరులో ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. దీనికి తోడు కార్యాలయంలో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులు సమయానికి రావడం లేదు. ఉన్న కొందరు భూసేకరణ పనుల్లో పెనుకొండ ఆర్డీఓ కార్యాలయానికి తిరగాల్సి వస్తోంది. దీంతో ప్రజలు సమస్యలతో వచ్చి అధికారుల కోసం కార్యాలయంలో పడిగాపులు పడాల్సి వస్తోంది. చిన్న పనైనా రోజుల తరబడి కార్యాలయానికి రావాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ తహసీల్దార్‌ని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు: ఏఈ



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉదయ్ శంకర్‌రాజ్

రొద్దం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో 30చెరువుల మరమ్మతుకు రూ.20కోట్లతో ప్రణాళికలు రూపొందించామని ఇరిగేషన్ ఏఈ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. రూ.8లక్షలతో చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వైఎస్ఆర్ లేఅవుట్ వద్ద చెరువు కాలువ ఆక్రమణకు గురైందని సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు పేర్కొనగా వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజ్ సమాధానం ఇచ్చారు. దొడగట్ట ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కలిపి సింగిల్‌విండో అధ్యక్షుడు రామచంద్ర ఎంఈఓ విజయభాస్కర్‌ను కోరారు. రొద్దంలో ఐదుచోట్ల సోలార్ సబ్‌స్టేషన్‌లకు పదెకరాలు చొప్పున భూమి కేటాయిస్తామని తెలిపారు. బొక్సంపల్లిలో 5500 ఎకరాలు సోలార్ ఏర్పాటుకు ప్రభుత్వం సర్వేచేసినట్లు తహసీల్దార్ తెలిపారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ రామక్రిష్ణప్ప, జడ్పీటీసీ పద్మావతి, ఎంపీడీఓ రామకుమార్, డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, హౌసింగ్ ఏఈ ఖాజామైనొద్దీన్, ఏపీఎం జయచంద్ర, పశువైద్యాధికారి జాహ్నవి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులు పెట్టిన వారిని అరెస్ట్ చేయండి



కియ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మంత్రి సవితపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టి వైరల్ చేసినవారిని వెంటనే అరెస్ట్ చేయాలని కియ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షుడు సోమశేఖర్, రామక్రిష్ణ, ఆదిశేషు మాట్లాడుతూ వైసీపీ పాలనలో 2021లో మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేసిన జగన్ 2023నాటికి పూర్తీచేస్తామన్నారు. అయితే కళాశాలలలో ఒక్క విభాగం కూడా వందశాతం పూర్తీకాక పునాదులకే పరిమితమైందన్నారు. మూడురోజుల క్రితం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని సందర్శించి పునర్‌నిర్మాణానికి మంత్రి నాంది పలికారన్నారు. ఇది జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు సోషల్‌మీడియ కోవర్టులు ఆదివారం మంత్రి సవితపై వాట్సప్ గ్రూపుల్లో వ్యంగ్యంగా పోస్టులు చేయడంపై నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువుతండాకు చెందిన నవీన్, వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉనికి కోసమే మంత్రిపై వలస పక్షుల చిందులు: టీడీపీ

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉనికి కోసమే వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ మంత్రి సవితపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ చిందులు వేస్తోందని కురుబ సంఘం నాయకుడు కృష్ణమూర్తి మండిపడ్డారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల పరిశీలనలో మంత్రి సవిత పనులు జరగలేదని చూపించిందని ఇదే తరహాలో ఉష శ్రీచరణ్ పరిశీలించి ప్రజలకు అర్థమయ్యేవిధంగా మాట్లాడాలని, మంత్రిపై విడ్డూరంగా మాటాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నీవు చేసిన దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలు అన్నీ ఇన్నీకావని అక్కడ తంతే పెనుకొండలో వచ్చి పడ్డావని, ప్రస్తుతం పెనుకొండ ప్రజలు తరిమితే బెంగళూరుకు చేరావని, అలాంటి నీవు మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

గుడిబండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేశవరెడ్డి తెలిపారు. సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

బీసీ హాస్టల్ తనిఖీ

అగళి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధూడి బీసీ హాస్టల్‌ను ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు సోమవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. విద్యార్థులు విద్య, భోజన విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వార్డన్ సికిందర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

సోమందేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వెళ్తూ హెల్మెట్ ధరించని వాహనదారులు 16మందికి పోలీసులు రూ.12వేలు జరిమానా విధించారు. మండల కేంద్రంలోని 44వ జాతీయరహదారిపై సాయంత్రం వాహన తనిఖీలను ఎస్ఐ రమేష్, సిబ్బందితో కలిసి చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హిందూపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తూమకుంట చెరువువద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.10వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో తూమకుంట చెరువు వద్దకు వెళ్లి దాడిచేయగా ఆరుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి నగదు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

ఇంజనీర్ల సేవలు అమోఘం: మున్సిపల్ చైర్మన్



ఇంజనీర్లను సత్కరిస్తున్న చైర్మన్, కమిషనర్

హిందూపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులు నిర్మించడంలో కీలకపాత్ర పోషించే ఇంజనీర్ల పాత్ర అమోఘమని మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున అన్నారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం ఇంజనీర్ విభాగం అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్లు మాట్లాడుతూ ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఏడాదికోసారి గుర్తుంచుకోవడం మన బాధ్యత అన్నారు. ఆయన జీవితం నేటి యువ ఇంజనీర్లకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఎంఈ దస్తగిరి, డీఈఈ వాణి, లోకేష్, ఏఈ జనార్దన్, శంకర్, రాజేంద్ర, ఏసీపీ చంద్రమ్మ, నాయకులు నవీన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం



మాట్లాడుతున్న ఫైరోజ్ బేగం

మడకశిర టౌన్/రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టలాని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం సూచించారు. సోమవారం అర్బన్ పరిధిలోని మల్లినాయకనపల్లిలో సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల నూరు శాతం అందించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, డాక్టర్లు నరేష్, శివానంద్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

లేపాక్షి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, మండల మాజీ కన్వీనర్ జయప్పకు ప్రభుత్వం ఏపీటూరిజం శాఖ డైరెక్టర్‌గా నియమించినందుకు సోమవారం తెలుగుతమ్ముళ్లు మండల వ్యాప్తంగా సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. పలువురు టీడీపీ నాయకులు జయప్పకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థుల భద్రత కోసం డైరెక్టర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, మండల కన్వీనర్ అబి పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.45వేలు ప్రిన్సిపాల్ సుందర్‌రాజుకు అందజేశారు. నాయకులు అంజి, శ్రీరాములు, మంజు, తిప్పారెడ్డి పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న చేనేత సంఘం నాయకులు

సోమందేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని చేనేతలు కోరారు. ఆగస్టు నుంచి అమలులోకి వచ్చిన ఉచిత విద్యుత్ పథకం అధికారికంగా అమలు కాలేదన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఉచిత విద్యుత్ తమకు పథకం వర్తించలేదని ఆ సంఘం నాయకుడు నారాయణస్వామి విమర్శించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చేనేతలతో కలిసి డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 7వ తేదీన చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ఉచిత విద్యుత్ హామీని అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించారన్నారు. అది అమలుకు నోచుకోలేదన్నారు. 50ఏళ్లు నిండిన నేతన్నకు పింఛన్ అందించాలన్నారు. చేనేత భరోసా పథకం కింద రూ.20వేలు పెట్టుబడిసాయం అందించాలన్నారు. దాసరి సుధాకర్, మా మిళ్ల శ్రీనివాసులు, ఈశ్వర్, బెస్త కిష్టప్ప, కుమ్మరికిష్టప్ప, ఈడిగ నాగరాజు, వడ్డి నాగరాజు, మల్లికార్జున, బెస్త వెంకటేశ్వర్లు, ఖాసీం పాల్గొన్నారు.



యానిమేటర్‌కు బయోమెట్రిక్ యంత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

డ్వాక్రా సంఘాల సృష్టికర్త చంద్రబాబు

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సృష్టికర్త సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో డ్వాక్రా సంఘాలను సీఎం ప్రవేశపెట్టారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 270మంది యానిమేటర్లకు బయోమెట్రిక్ డివైస్‌లను పంపిణీ చేశారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గు దస్తగిరితో కలసి ఎమ్మెఏల్యపాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాలను బలోపేతం చేయాలని, ప్రభుత్వం నుంచి వారు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకు రుణాలు సకాలంలో అందేవిధంగా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో వారికి అవసరమైన ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందారంటే కుటుంబంలో అందరూ బాగుంటారని సీఎం విశ్వాసం అన్నారు. మహిళలకు సంఘాల ద్వారానే కాక పారిశ్రామికంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం కృషి చేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ నాగరాజు, ఈరన్న, తిప్పేస్వామి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, కుమార్‌స్వామి, గణేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పరిగిలో పోస్టర్లు విడుదల చేస్తున్న యుటీఎఫ్ నాయకులు

పరిగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా 15 నుంచి 19వరకు నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని జిల్లా ఆడిట్‌కమిటీ కన్వీనర్ మహంతి, కృపాసత్యరాజ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రణభేరికి సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ ఊసేలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడుస్తున్నా ఒక్క డీఏ కూడా ఇవ్వక వేల కోట్లరూపాయల బకాయిలు ఎప్పుడుచెల్లిస్తారోనని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఎం బాబాఫక్రుద్దీన్, లక్ష్మీపతి, టీచర్లు శంకరప్ప, సుజాత పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్: పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్ వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. త్రిమూర్తి, గాజుల గోపాల్, వెంకటరమణనాయక్, ఆంజనేయులు, చంద్రమౌళి, శ్రీనివాసులు, గణేష్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో కరాటే నిర్వాహకులు

గోరంట్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కర్నూలులో 12వ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో గోరంట్ల కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు నిర్వాహకుడు త్రివిక్రమ్ ప్రకటనలో తెలిపారు. జీకేఎంఏ అసోసియేషన్ ఏర్పాటు చేసిన పోటీల్లో కరాటే మాస్టార్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 11 మంది 22 విభాగాల్లో పాల్గొన్నారు. కటా విభాగంలో తేజేష్‌కుమార్, అండర్ 13లో గోల్డు మెడల్ సాధించగా, వివిధ విభాగాల్లో శంశాక్, తస్వీష్‌కుమార్, గగన్‌లకు సిల్వర్ మెడల్, సాయికార్తిక్, పూర్వజ్‌కుమార్, ఖాద్రీచౌదరి, సూర్యతేజ్, హరిక్రిష్ణకు బ్రాంజ్‌మెడల్, బాలికల విభాగంలో దీపిక, జెస్సికారెడ్డిలకు బ్రాంజ్ మెడల్, కుమితే విభాగంలో హరిక్రిష్ణకు సిల్వర్, శంశాక్ సూర్యతేజలకు బ్రాంజ్ మెడల్ లభించాయి. ఇన్‌స్ట్రక్టర్లుగా తోరణదీక్ష, విష్ణుప్రియ, వెన్యా, సౌపర్ణిక వ్యవహరించారు.



ప్రతిభ చాటిన కరాటే విద్యార్థులతో కరస్పాండెంట్

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న స్థానిక బ్రిలియన్స్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొంది ప్రతిభను చాటుకున్నారు. 14న కర్నూలులో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న సలోని కుమారి ప్రథమ స్థానంలో, శ్రీకుల్వంత్, మల్లేశ్‌నాయక్ ద్వితీయ, ప్రవీణ్య, లలిత, హర్షిణి, తృతీయస్థానంలో గెలుపొందినట్లు కరస్పాండెంట్ నాగవేణి తెలిపారు. విద్యార్థులను కరాటే మాస్టర్ రామచంద్ర, నాగవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్యేలు మూకుమ్మడి రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న దళిత స్వాభిమాన సంఘం రాష్ట్ర నాయకులు

పావగడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు కులవ్యవస్థపైనే ఆధారపడి ఉన్నాయని, కులానికి ప్రాధాన్యమిస్తే ఆ ప్రాంత ఎమ్మెల్యేలు చేయాలని దళిత స్వాభిమాన ఐక్యత రాష్ట్ర కన్వీనర్ కేశవమూర్తి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మధుగిరి తాలూకా పోలేనహళ్లిలో ఆనంద్ అనే వ్యక్తిని హత్యచేసిన ఘటన, పావగడలోని బెళ్లిబెట్టు గ్రామంలో హనుమంతరాయప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 24వ తేదీన మధుగిరిలోని జిల్లా వ్యాప్తంగా దళితుల దండోర మోగించడానికి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హత్య జరిగిన కుటుంబాలకు ఎమెమ్మెల్యేగాని, అధికారులుగాని వారి కుటుంబాలను పరామర్శించడంగాని తెలియజేయకపోవడం కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడే వ్యక్తిత్వంగాని వారిలో లేకపోవడమే దీనికి నిదర్శనమని జిల్లా కన్వీనర్ సిద్దార్థ రంగయ్య, తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మేఘరాజ్, శంకరప్ప, రామన్న, కన్వీనర్లు హనుమంతరాయ, లింగన్న, మంజన్న, అజిత్ పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

గుడిబండ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనకుంట, కొంకల్లు రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు వ్యవసాయ అధికారి వీరనరేష్, టీడీపీ నాయకులు ఎరువులను పంపిణీ చేశారు. మద్దనకుంట రైతు సేవా కేంద్రంలో రైతులకు 140 బస్తాలు, కొంకల్లు రైతు సేవా కేంద్రంలో 140 బస్తాలు పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు. రంగనాథ్, అపర్ణ, షబ్బీర్ పాల్గొన్నారు.